అప్పుడే కాలేజీ నుండి ఇంటి కొచ్చాను, గేటు తీసుకుని లోపలికి వచ్చి సైకిలు స్టాండ్ వేశాను. ఆ శబ్దం విని నా భార్య లోపలి నుండి వచ్చింది. సైకిలుకు తగిలించిన కూరల సంచీ తీసి ఆమెకిచ్చాను. దాన్నందుకుంటూ.

"ఊరి నుండి మీ మేనత్త కూతురు స్వర్ణ వచ్చింది" అని.

"అలాగా ! ఎంతసేపయింది వచ్చి! " అనడిగాను.

"గంటవుతుంది !"

"సరే !"

గుమ్మం దగ్గర చెప్పులు విడిచి ఇంట్లో కొచ్చాను. పిల్లలతో మాట్లాడు తున్న స్వర్ణ నన్ను చూసి లేచి నిలబ డింది.

"స్వర్ణా ! బాగున్నావా !" అంటూ పలకరించి "కూర్చో" అని లోపలికి వెళ్ళి బట్టలు మార్చుకుని కాళ్ళు, ముఖం కడుక్కువచ్చాను.

హాల్లో పిల్లలు లేరు. స్వర్ణ ఒక్కతే కూర్చుని ఏదో పుస్తకం తిరగేస్తోంది.

నేను కుర్చీలో కూర్చుని "ఎలా ఉన్నావు స్వర్ణా" అన్నాను.

"ఇదిగో ! ఇలా ఉన్నాను !" పుస్తకం ప్రక్కన పెట్టి నవ్వింది.

ఇంతలో నా భార్య మా ఇద్దరికీ కాఫీ తెచ్చింది.

"స్వర్ణ పెద్ద సమస్యలో చిక్కుకుం దండి !" అంది నా భార్య.

"ఏమిటది స్వర్ణా !" అనడిగాను.

"చెప్తాను బావా ! నీకంటే ఆప్తులెవ రున్నారు నాకు. నీకు చెప్పుకోవాలనే వచ్చాను !"

"ఏమిటో చెప్పు స్వర్ణా !"

"ఏవుంది బావా ! నా పొలం కట్టు బడి విషయం !" అంది.

స్వర్ణ భర్త పోయాక ఆమె వాటాగా అత్తింటి వారి చ్చిన మూడెకరాలే ఆమెకిప్పుడు జీవనాధారం.

"స్వర్ణా ! పల్లెటూళ్ళు చాలా మారిపోయాయి. ఇప్పుడు కట్టుబడులు రావు. అదీకాక మనుషులను చూసి కట్టుబడికి ఇవ్వాలి. ఇంతకీ ఎవరికిచ్చావు కౌలుకి ?" అనడిగాను.

"నరసింహయనకి. అతని పొలం ప్రక్కనే నా పొలం ఉన్నది గదా ! దాన్ని తనకు కట్టుబడికి ఇప్పించమని మా బావగారిని అడిగాడు. మా బావగారు నా దగ్గరి కొచ్చి అతడు నిజాయితీపరుడు నీకు కట్టుబడి కళ్ళం లోనే ఇస్తాడు. అంతేకాదు ఎప్పుడైనా నీకవసరమయితే తన పురిలో నుండయినా ధాన్యం ఇస్తానని అన్నాడు-అంటూ మా బావగారు అతని గురించి గొప్పగా చెప్పారు. అక్కడికీ మా బావగారితో అన్నా. కట్టుబడి రాకపోతే నాకు తిండికి కూడా జరగదని !" అట్లా జరగనిస్తానా ?" అన్నారు మా బావగారు !"

"అయితే ఆ నరసింహయ్య కే ఇచ్చావన్నమాట !"

"అవును బావా ! కానీ ఈ సంవత్సరం కట్టుబడి ఇవ్వలేదు" అంది.

"మీ బావగారితో చెప్పకపోయావా ?"

"చెప్పాను !"

"ఏమన్నారు !"

"నేనేం చేయనమ్మా ! ఆ నరసింహయ్య నమ్మక ద్రోహం చేశాడు. గట్టిగా వాడిని అనడానికి వీల్లేకుండా ఉందమ్మా ! వాడు గ్రామ సర్పంచ్ కదా ! వాడికోపం వస్తే మనకే నష్టం వస్తుంది" అన్నారు మా బావ గారు" అంటూ. బాధగా చెప్పింది స్వర్ణ.

"అయ్యో ఎంతపని జరిగింది!"

"ఇప్పుడేం చేయాలో తోచకుండా ఉంది ?"




"ఈ ప్రపంచంలో దుర్మార్గం ఎక్కువైపోయింది. ధనం -అధికారం ఉన్నవాడు బలహీనుల్ని అణచాలని చూస్తుంటాడు. మనం అశక్తులం. వాడిని బ్రతిమాలుకో వాల్సిందే ! మీ బావగారిని-మరిదిని కలిసి ఆ నరసింహయ్య దగ్గరకు వెళ్ళి ఆమెకి భర్త పోయాడు... ఆవిడకు పొలమే జీవనాధారం. నువ్వు అట్లా కట్టుబడి ఎగ్గొడితే ఆవిడెలా బ్రతుకుతుంది. మొదట అంత నమ్మకంగా చెప్పి ఇప్పుడిలా చేయడం అన్యాయం అంటూ చెప్పమను" అని స్వర్ణకు సలహా ఇచ్చాను.

"కానీ మా వాళ్ళకు అలా చెప్పే ధైర్యం లేదు. వాళ్ళెంత చెప్పినా అతను వినడు!" అంది.

నాకేం అనాలో తోచలేదు.

"బావా ! నువ్వొచ్చి సర్పంచ్‌తో మాట్లాడకూడదు ?" అనడిగింది.

నాకు స్వర్ణ అత్తగారి ఊరితో కానీ-ఆ ఊరి సర్పంచ్‌తో కానీ పరిచయం లేదు. ఏం చేయను! కానీ స్వర్ణకి ధైర్యం కలగడం కోసం-

"స్వర్ణా ! దిగులు పడకు నేనొచ్చి చెప్తాలే !" అన్నాను.

దానికే సంతోషించింది స్వర్ణ!

"బావా ! నువ్వు చదువుకున్న వాడివి. కాలేజీ మేస్టర్ పని చేస్తున్నావు. నువ్వు చెప్తే వింటాడని నా ఆశ."

"అలాగే !"

స్వర్ణ ఆ రాత్రికి మా ఇంట్లో ఉండి తెల్లవారాక ఊరికి బయలుదేరింది.

"బావా ! అశ్రద్ధ చేయకు. సర్పంచ్‌తో తప్పక మాట్లాడాలి ! ఆ గ్రామంలో నీ మేనత్త కూతురు-అనాధ ఉన్నదని-మరిచిపోకు !" అంటూ కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

"అదేమిటమ్మా ! చిన్న విషయానికే అంత దిగులెందుకు ? ఊళ్ళో వాళ్ళ మాటని కాదని ఎక్కడికి పోతాడు ఆ నరసింహయ్య !" అంతా సవ్యంగా జరుగుతుంది... బాధపడకు!" అంటూ ఓదార్చాను.

స్వర్ణ ఊరు వెళ్ళిపోయింది.

★ ★ ★

అయిదు నెలలు దొర్లిపోయాయి.

జూన్ నెల వచ్చింది.

తొలకరి వర్షాలు పడ్డాయి.

పల్లెటూళ్ళో మెట్ట దుక్కులు జో[illegible] సాగే కాలం.

ఒక ఆదివారం ఉదయం పది గంటలకు స్వర్ణ వచ్చింది. లోపలికొచ్చిన ఆమెను చూసి నా భార్య సాదరంగా ఆహ్వానించింది.

"ఏం బావా ! బాగున్నావా ?" హాలులో ఉన్న నన్ను పలకరించి లోపలికి వెళ్ళింది. మధ్యాహ్నం భోజనాలు అయ్యాక స్వర్ణ నా చదువుకునే గదిలో నేనుంటే అక్కడికి వచ్చి నా కెదురుగా కుర్చీలో కూర్చుంది.

"ఏం స్వర్ణా ! ఊళ్ళో మన వాళ్ళందరూ క్షేమమేనా ?" చదువుతున్న పుస్తకం ప్రక్కన పెడుతూ అడిగాను.

"ఆఁ... అందరూ బాగానే ఉన్నారు" అంది నిర్లిప్తంగా.

"గ్రామ సర్పంచ్ ఈ ఏడైనా నీకు కట్టుబడి ఇచ్చాడా ? దాని గురించి ఉత్తరం వ్రాయలేదే ?" అనడిగాను.

"వ్రాయడానికేముంది ? కట్టుబడి ఇవ్వలేదు. ఆయన ఇస్తాడా !..." అంది.

"ఊళ్ళో పెద్ద మనుషుల చేత అడిగించలే[illegible]యావా ?"

"అడిగించాను!"

"ఏమన్నాడు?"

"ఈ సంవత్సరం పంట పండలేదట... ఖర్చులెక్కువైనాయట. ఖర్చులకే చాల్లేదు పంట వచ్చే సంవత్సరం ఇస్తా" అన్నాట్ట.

"పోనీ ! అతని దగ్గరి నుంచి తీసేసి ఇంకెవరికైనా పొలం కౌలుకు ఇవ్వలేకపోయావా ? ఈ ఊడ్పుల కాలం దాటిపోతే పొలం ఎవ్వరూ తీసుకోరు కదా !"

"ఆ ప్రయత్నమూ అయింది. ఊళ్ళో ఎవ్వరూ నా పొలం కౌలుకు తీసుకోవడానికి ముందుకు రాలేదు. బహుశ ఆ సర్పంచ్‌కి భయపడి ఉంటారు... బావా ! ఏం చేయాలో పాలుపోవడం లేదు !" అంది దిగులుగా.

"స్వర్ణా ! నువ్వు మా ఇంట్లో వచ్చి ఉండు. తర్వాత

నీ భవిష్యత్తు గురించి ఆలోచిద్దాం" అన్నాను.

"స్వర్ణ నవ్వింది."

"బావా ! నీ సహధర్మచారిణిగా ఉండి సేవ చేస్తూ జీవితం గడపాలనుకున్నాను. కానీ మేం దరిద్రులమని -కట్నం ఇవ్వలేమని మీ వాళ్ళు నన్ను తిరస్కరించారు. ఇంత జరిగాక పౌరుషం గల స్త్రీ నీ దగ్గరకు చేరుతుందా ? అయినా నీ భార్య ఒప్పుకుంటుందా ? ఇక్కడికి నా జీవితం ఇట్లా అయింది ! నే నెవరిమీదా ఆధారపడను. స్వతంత్రంగా బ్రతుకుతాను" అంది స్థిరంగా.

"నువ్వేం చేయగలవో ! ఎలా బ్రతకగలవో నాకు అర్థం కావడంలేదు స్వర్ణా !"

"బావా ! ఒక్క మాట... స్త్రీ తెగించాలే కానీ పురుషుడు సాధించలేనిది స్త్రీ సాధించి తీరుతుంది. "నువ్వే చాలా అందమైనదానవు ! నిన్నే పెళ్ళి చేసుకుంటాను అని చిన్నప్పటి నుంచి ఊరించి-ఊరించి నన్ను కాదని డబ్బు కాశపడి ఇంకొకరిని చేసుకున్నావు... నాకూ పెళ్ళయింది. ఒక రోజు తిని-ఒక రోజు తినక ఆ భర్త సేవ చేస్తూ రోజులు నెట్టుకొస్తుంటే -ఆ భగవంతుడా భర్తను కూడా లేకుండా చేశాడు. ఇప్పుడు నాకు ఎవరు రక్షణలేరని ! తాను ధనవంతుడినని-గ్రామంలో తనకె దుర[illegible]ని నా జీవనాధారమైన ఆ మూడెకరాల పొలాన్ని కాజేయడానికి ఆ సర్పంచ్ చూస్తున్నాడు. ఏం జరుగుతుందో నేనూ చూస్తాను.

బావా ! నేను సాయంకాలం బస్సుకి ఊరెళ్ళిపోతాను. నాకు ఒక వంద రూపాయలు అప్పివ్వు. క్రిందటిసారి ఇచ్చిన యాభై-ఈ వంద మొత్తం ఒక సంవత్సరంలో ఇచ్చేస్తాను" అంది స్వర్ణ.

మాట్లాడకుండా పర్సులో నుంచి తీసిచ్చాను.

ఆ సాయంత్రం స్వర్ణ ఊరెళ్ళిపోయింది.

స్వర్ణకేవిధమైన సహాయం చేయలేకపోయాననే బాధ నా మనస్సుని దహించివేయసాగింది. నా అశక్తతకు నన్ను నేనే నిందించుకున్నాను.

★ ★ ★

జూన్ నెలలో కాలేజీలు తెరిచారు.

ఒక రోజు ఉదయం ఎనిమిది గంటలకు ఒక కుర్రాడు వచ్చి "మాస్టారు గారున్నారా !" అని అడుగుతున్నాడు.

నేను బయటికి వచ్చి 'ఎవరని' అడిగాను.

"నమస్కారం మాస్టారూ ! నేను వర్ధమానపురం నుంచి వచ్చానండి!" గురజలో ఉన్న మామయ్య మీకు ఉత్తరం ఇచ్చాడు !" అంటూ ఒక కవరు అందించాడు.

బావా ! ఒక్క మాట... స్త్రీ తెగించాలే కానీ పురుషుడు సాధించలేనిది స్త్రీ సాధించి తీరుతుంది. "నువ్వే చాలా అందమైనదానవు ! నిన్నే పెళ్ళి చేసుకుంటాను" అని చిన్నప్పటి నుంచి ఊరించి-ఊరించి నన్ను కాదని డబ్బు కాశపడి ఇంకొకరిని చేసుకున్నావు...

ఉత్తరం చించి చదివాను.

ఆతనికి బి. ఎ. మొదటి సంవత్సరంలో సీటు కావాలిట. వాళ్ళ మావయ్య మా ఊరుకు చెందినవాడు. నాకు పరిచయం ఉంది.

"సరేనోయ్ ! పది గంటలకు సర్టిఫికెట్‌తో — డబ్బుతో కాలేజీకి రావయ్యా !" అని చెప్పాను.

అతను అలాగే వచ్చాడు.

ప్రిన్సిపాల్‌తో మాట్లాడి అతనికి సీటు ఇప్పించాను. కాలేజీలో చేరాడు. ఆ కుర్రాడి పేరు మధుసూదనరావు. అతని మావయ్యా నాకు సన్నిహితుడవడం వల్ల మధుసూదనరావు తరచుగా మా ఇంటికి వస్తూ పోతూ ఉండేవాడు.

రెండు నెలలు గడిచాయి.

మధుసూదనరావుది మా స్వర్ణ ఊరే. స్వర్ణ మా ఇంటికొచ్చి చాలా రోజులైపోయింది. ఆమె ఎలా ఉందో ! ఆమెకు రావలసిన కట్టుబడి వచ్చిందో ! లేదో ! పొలం ఈ సంవత్సరం ఎవరికి కౌలుకిచ్చిందో ! తెలుసుకోవాలనే కోరిక కలిగింది.

ఆ రోజు ఆగస్టు 15-స్వతంత్ర దినం-కాలేజీలకు సెలవు. మధుసూదనరావు మధ్యాహ్నం మూడు గంటలకు మా ఇంటికి వచ్చాడు... అతనిని కూర్చోబెట్టి మాట్లాడడం మొదలుపెట్టాను.

అతని మావయ్యదీ-నాదీ ఒక ఊరు కావడంతో ముందు ఆ ఊరి విశేషాలు అడిగి తెలుసుకున్నాను. ఇక తర్వాత స్వర్ణ గురించి అడగడం మొదలెట్టాను.

"మధుసూదనరావ్గూ ! మీ వర్ధమానపురంలోని బ్రాహ్మణులందరూ నీకు తెలుసా !" అంటూ మొదలెట్టాను.

"నాలుగే కుటుంబాలు కదండీ ! అందరూ తెలుసు!"

"స్వర్ణని ఎరిగున్నావా ?"

"ఆ ... తెలుసండి.. ఆమె మీకు బంధువులా మాస్టారుగారూ !" అని అడిగాడు.

"దూరపు బంధువులే... ఆమెకు మీ ఊరి సర్పంచ్ కట్టుబడి ఇవ్వక-పొలమూ వదలక చాలా ఏడిపిస్తున్నాట్ట కదా ! ఎవ్వరూ అతనికి చెప్పలేదా !"

"చెప్పకేమండీ ! ఆ ఊరి కరణం గారూ-ఆమె బావగారూ-మరిదిగారూ-అందరూ చెప్పారండీ ! కానీ వాడు వాళ్ళ మాటలు వింటాడా !" అన్నాడా కుర్రాడు.

"అవునయ్యా ! వినడు ! వాడు దుర్మార్గుడు. ఆమె పొలం కాజేయాలనే ఆశతో ఉన్నాడు. మీ నాన్న మోతుబరి రైతే కదా ! మీ నాన్న చెప్పొచ్చు కదా ఆ సర్పంచ్‌కి!"

"చెప్పాడండీ ! మా నాన్న మాటా వినలేదు. వాడు ఇంకో దుర్మార్గం చేశాడండీ... కట్టుబడి ఇవ్వలేదు.... పోనీ పొలం ఎవరికన్నా ఇచ్చుకుందామంటే వదలలేదండీ ! అది మరీ ఘోరమండీ !" అన్నాడు మధుసూదనరావు.

"అప్పుడామె ఏం చేసింది ?"

"ఏదో చేసిందిలెండి" అతడు చెప్పడానికి సందేహిస్తున్నట్లుగా కనిపించింది.

"ఫరవాలేదు చెప్పవోయ్ ! ఇంతకీ వాడు పొలం వదిలాడా ? లేదా ?"

"వాడు వదులుతాడా ? ఊళ్ళో ఎందరిచేతో చెప్పించింది. వినలా ! చివరకు ఆ పొలాన్ని ఒక సాహెబ్‌కి కట్టుబడికిచ్చింది ! అతని పేరు హమీద్ ! అతడు నాగలి కట్టి చేలో ప్రవేశించేటప్పటికి ఆ సర్పంచ్



కానీ-అతని మనుషులు కానీ చేలోకి వెళ్ళలేదు..."

"ఊళ్ళోవాళ్ళు ఊరుకున్నారా ?"

"ఏం చేస్తారండీ ! అయితే మాస్టారుగారూ ! ఈ పనిలో ఆమె కాస్త అపకీర్తిపాలయిందండీ !"

"తిండి కొరకు చేయకూడనిపని చేసిందన్నమాట !" అన్నాను.

"చేయకూడనిదో ! చేయవలసినదో ! ఎవరు చెప్పగలరు !

మాస్టారూ ! ఆమె బ్రతకాలంటే ఇంకో మార్గం లేదు. వాడు కట్టుబడి ఇవ్వడు. పొలం వదలడు. అమ్మకోనివ్వడు. ఆమె ఏం చేయాలి ?

"స్వర్ణ ఊళ్ళోనే ఉంటోందా ? ఊరు విడిచి వెళ్ళిపోయిందా ?"

"ఆమె ఊళ్ళోనే ఉంటోందండీ ! రోజూ ఉదయం తడి బట్టలతో చెరువు దగ్గరి నూతి నుండి నీళ్ళు తీసుకుని వెళుతుంటుంది. సాయంకాలం దేవాలయానికి వెళ్ళి పురాణం వింటుంది."

"ఆ సాహెబు ఆమె ఇంటికి తరుచూ వెళ్ళుతుంటాడా ?"

"ఆ... వెళుతూ ఉంటాడు?"

నేను మౌనంగా కూర్చున్నాను.

"మాస్టారూ ! ఆమె మీకు బంధువులు అన్నారుగా ... ఆమె బాధలు మీకు చెప్పుకోలేదా ?"

"చెప్పుకుంది ?"

"మరి మీరేం సాయం చేయలేదా ?" ప్రశ్నించాడు.

"చేయలేకపోయానయ్యా ?" అన్నాను.

"మాస్టారూ ! మీరెవ్వరూ ఆమె సమస్యను పరిష్కరించలేకపోయారు. మా గ్రామంలోని ఏ సంఘమూ ఆమె సమస్య తీర్చలేదు. ఇక ఆమె తన సమస్యని తానే ధైర్యంగా పరిష్కరించుకుంది. ఇంకెందుకండీ మాస్టారూ ! మీరు బాధపడతారు ? ఆమె చాలా మంచిదని ఆ గ్రామంలో ఆడవాళ్ళు చెప్పుకుంటారు ? మంచితనమే కాదండీ ! నా అభిప్రాయంలో సిపాయి తిరుగుబాటులో పాల్గొన్న ఝాన్సీ లక్ష్మీబాయి వంటి ధైర్యశాలి. ఆమె దారిని ఆమెని బ్రతకనీయాలి"-అంటూ ఆవేశంగా అన్నాడు మధుసూదనరావు.

"నువ్వు భావి భారత పౌరుడివయ్యా ! అందుచేత నువ్విట్లాగే మాట్లాడుతావు" అన్నాను. ఇంకేమనాలో తోచక !

★